# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-10-2025　　　　సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన బాలికలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.
- విజయనగరం ఉత్సవాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి.
- మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా శ్రీలంకలోని కొలంబో వేదికగా భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది.

==================

ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, దేవదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఇతర ఉన్నత అధికారులతో ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన దివ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆలయ సమగ్రాభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. దేవాలయం అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల భూమిని దేవాదాయ శాఖకు కేటాయించేలా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ క్షేత్రానికి జాతీయ రహదారులను అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందిచాలని పేర్కొన్నారు.　భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్న సందర్భంగా సౌకర్యాలను విస్తరించాలని ఆయన సూచించారు.

==================

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఏకలవ్య గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన బాలికలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విశాఖలోని కేజీహెచ్ లో

వైద్య సేవలు పొందుతున్న విద్యార్థినిలను మంత్రి ఈరోజు పరామర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గురుకుల పాఠశాలకు చెందిన మొత్తం 129 మంది పచ్చకామెర్ల వ్యాధికి గురయ్యారని తెలిపారు. వారిలో 37 మందికి కె.జి.హెచ్ లో చికిత్స అందిస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==================

విజయనగరం ఉత్సవాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా జానపద కళలతో కనువిందు చేస్తూ, కళా రూపాలతో మైమరిపింప జేస్తూ, విచిత్ర వేషధారణలతో ఆకట్టుకుంటూ ఉత్సవ శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది. విజయనగరం ఉత్సవాల ప్రారంభానికి సంకేతంగా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఉదయం రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ ఉత్సవాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కోట వద్ద ప్రముఖులు ఆశీనులై కళారూపాలను తిలకించారు. హోం మంత్రి అనిత, విజయనగరం శాసన సభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు పలువురు మహిళలతో కలిసి థింసా నృత్యం చేశారు. అంతకుముందు శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొనేందుకు ఇటువంటి పండుగలు దోహదం చేస్తాయన్నారు. నేటి తరానికి సంప్రదాయాలు, కళలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. జానపద కళలను, కళాకారులను ఆదుకునేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో అవసరం అని అన్నారు. పైడితల్లి అమ్మవారు ప్రజలందరినీ చల్లగా చూడాలని ఆయన ఆకాంక్షించారు.

విరామం

==================

శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాల కారణంగా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం 8 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఇటీవల జిల్లాలోని భారీ వర్షాలు కారణంగా టుబ్బూరు గ్రామంలో మట్టి గోడ కూలి మృతి చెందిన వృద్ధ దంపతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతులు మీదుగా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఈరోజు చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

==================

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకులంలో విద్యార్థుల అస్వస్థతపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యం పాలయిన ఘటనపై అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లిన్నట్లు మంత్రి  తెలిపారు. గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లబారిన పడిన పలువురు బాలికలకు కేజీహెచ్, ఇతర ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. అదే విధంగా పార్వతీపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ తో పాటు గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు వెళుతున్నట్లు మంత్రి సంధ్యారాణి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతపురంలో శిశు సంరక్షణ కేంద్రంలో పసిబిడ్డ మృతిపై మంత్రితో మాట్లాడిన ముఖ్యమంత్రి, ఈ రెండు ఘటనలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

==================

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్ నిన్న రికార్డ్ స్థాయిలో అత్యధిక మంది ప్రయాణీకులకు సేవలందించి సరికొత్త మైలురాయిని సృష్టించింది. నిన్న ఒకే రోజులో వచ్చే పోయే ప్రయాణికులు కలిపి మొత్తం 5 లక్షల 50 వేల మంది ఈ డివిజన్ మీదుగా రాకపోకలు సాగించారని విజయవాడ డివిజన్ పౌర సంబంధాల అధికారి నుస్రత్ ఎం.మండ్రుప్కర్

తెలిపారు. దీంతో విజయవాడ డివిజన్ ఒక్క రోజులోనే 5 కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. ఇది సమర్ధవంతమైన నిర్వహణతో పాటూ విజయవాడ డివిజన్ కార్యాచరణ చరిత్రలో అపూర్వమైన విజయాన్ని సూచిస్తోందని ఈరోజు ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.

==================

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా శ్రీలంకలోని కొలంబో వేదికగా భారత్ - పాకిస్థాన్ జట్ల వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన పాకిస్థాన్  బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన భారత్ 35 ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 160 పరులుగు చేసింది.

==================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా ద్రోణి కొనసాగుతోందని పేర్కొంది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ…

(వాయిస్ 26 సెకన్లు)

==================

కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తూ.. మంచి ప్రభుత్వంగా ప్రశంసలు అందుకుంటోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత అన్నారు. తిరుపతిలోని బస్టాండ్ సర్కిల్ లో భక్తకనకదాసు విగ్రహాన్ని మంత్రి ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ… భక్త కనకదాసు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం అందివాలని కోరుకున్న మహోన్నత వ్యక్తి అని, అలాంటి వ్యక్తి విగ్రహాన్ని ఈ పవిత్ర స్థలంలో నెలకొల్పడం ఎంతో ఆనందదాయకమన్నారు.

==================
==================